పెద్దకథ




అరుణిమకు తిరిగిన ఆకాశం సంధ్యాదేవికి స్వాగతం పలుకుతోంది. పక్షులు బారులు బారులుగా ఎగురుతూ పోతున్నాయి. ఇవి గూటికి చేరేసరికి రెక్కలురాని చిన్నారి కూనలు ఆకలితో చిట్టి చిట్టి నోళ్లు తెరుచుకుని చూస్తూంటాయి కాబోలు.

కిటికీదగ్గర నిలబడి రోడ్డుమీదికి

చూస్తున్న కమలుల వక్షుల కలకలా రావాలకు వోమారు ఆకాశంకేసి చూసింది. స్నానంచేసి ఇస్త్రీచేసిన తెల్లటి వాయిల్ చీర కట్టుకుని, జడలో మల్లెలు తురుముకుని ఆ కిటికీ దగ్గర నిలబడి శ్రీవారికోసం ఎదురు చూడట మనేది కమల దినచర్యలో ఒక ముఖ్యభాగం. రోజల్లా ఫైళ్ల మధ్య వుక్కిరిబిక్కిరయిపోయే మాధవరావు తాను అలసటతో యింటికి వచేటప్పటికి శ్రీమతి చిరునవ్వుతో ఎదురు రావాలంటాడు.

రోడ్డు చాలా జనసమర్ధంగా వుంది - వచ్చేపోయే కార్లు, రిక్షాలు,, మనుష్యులు - ఎవరిపనిమీద వారు హడావుడిగా ఏదో కొంపలు మునిగిపోతున్నట్లు గబగబా నడుస్తున్నారు.

రోడ్డుమీదకు చూస్తూన్న కమల దృష్టి ఎదురింట్లోంచి వస్తూవున్న వ్యక్తులమీద పడింది. ముకుందరావు ఆతని భార్య, అయిదుగురు పిల్లలు, వీధిలోకి వచ్చారు. ముకుందరావు తలుపుతాళంవేసి కమలను వోరగంట చూస్తూ రోడ్డెక్కి నడక సాగించాడు.

ముకుందరావు భార్య కామాక్షి కమల దగ్గరకి వచ్చి, 'అక్కయ్యగారూ! రాత్రి రావడం ఆలస్యమవుతుందేమో! పాలవాడొస్తే పాలు పోయించుకోండి' అంది.

'సినిమా కేమిటి బయల్దేరారు ?' అంది మొహంమీదికి నవ్వు తెచ్చుకుంటూ కమల.

'అఁ! సినిమాలాగే వుంది. నాలుగ్గంటలనుంచీ కడుపు నొగబట్టిందండీ, కూర్చోలేను, నడవలేను. డాక్టరు దగ్గర కెళ్దామని'

'అయ్యో, అలాగా! ఈ పిల్లలంతా ఎందుకమ్మా ఆసుపత్రికి. ఇంటిదగ్గర వుంచేయండి ఆడుకుంటారు.'

'చీకటిరాత్రి. చిన్నపిల్లల్ని ఒంటరిగా ఇంటిదగ్గర వుంచడానికి మనస్కరించలేదండీ. వీళ్ళని చూస్తుంటే కడుపు తరుక్కుపోతుంది. తల్లిలేని పిల్లలు. వీళ్ళకేలోటూ రాకుండా పెంచి పెద్దవాళ్ళనిచేసి నా బాధ్యత సరిగా నిర్వహించగలనా అని నాలో నేను మథనపడ్తూ వుంటాను. ఆ సహనం, శక్తి ప్రసాదించమని దేవుణ్ణి ప్రార్థిస్తూవుంటాను. వీళ్ళందర్నీ చూసుకుని ఇల్లు చక్కబెట్టుకునేసరికి రాత్రికి వాళ్ళంతా పచ్చి చేస్తోందండీ, పెళ్ళయేవరకూ ఒక్క పని చాతకాదు నాకు. 'కళ్ళంట నీళ్ళు గిర్రున తిరిగాయి ఆ అమ్మాయికి.

'పాపం' అంది కమల సానుభూతిగా.

"వెళ్లొస్తానండీ, అక్కయ్యగారు, పొద్దుపోతోంది" అంటూ భర్తవెంట నడచింది కామాక్షి బరువుగా అడుగులు వేస్తూ.

ఆ భార్యాభర్తలవంక చూస్తున్న కమలకి గతమంతా జ్ఞాపకమొచ్చింది కామాక్షి ముకుందరావు రెండవ భార్య. నలభయ్యోఏట మళ్ళీ పెళ్ళీ చేసుకున్నాడు ఆ పిల్లని. మహావుంటే ఆమెకు పదహారేళ్ళుంటాయేమో. కమలకా ముకుందరావును చూస్తుంటే వొళ్ళు భగభగా మండి పోతుంది. క్రిందటేడు యీ పాటికీ సావిత్రి పిల్లల్తో ఆ యిల్లు కళకళ్లాడుతూ వుండేది. సావిత్రీ కమలా ఎంతో స్నేహంగా కలిసిమెలసివుండే వారు. వాళ్ళిద్దరి మధ్యా ఎలాంటి అరమరికలూ వుండేవి కావు. తమ సంసారంలోని బాగోగులూ, కష్ట సుఖాలూ అన్నీ కమలతో చెప్పుకుని మనస్సు తేలిక చేసుకునేది సావిత్రి.

అయిదోవాడు పుట్టినప్పుడుచాలా నీర్సపడిందామె. "సావిత్రీ, చాలా బలహీనంగా వున్నావు. ఇక కాన్పు వస్తే మంచిదికాదు. ఆపరేషను చేయించుకో," అని లేడీ డాక్టరు శత విధాల చెప్పిందిట. కాని ఆమొగుడు మహానుభావుడికి పిల్లలంటే ముద్దుట. "ఆపరేషనేమిటి? నలుగురూ నవ్వి పోతారు. మా కాలంలో యిలాంటి వెరుగుదుమా! ఈనెప్పల్లి లాంటి దాన్ని నేను కనలేదూ కడిపెడు బిడ్డల్ని. అయిదుగురు పుట్టేసరికే కళ్ళు తేలేస్తోంది మాకోడలు.. అంటూ వుపన్యాసం ఇచ్చేసిందిట వాళ్ళత్తగారు లేడీడాక్టరు మొహం మీద. అరుగురు ఆడపిల్లలూ ఏనమందుగురు నుగపిల్లలూ వెరసి పధ్నాలుగు మందిట ఆవిడ సంతానం పోయినవాళ్ళు పోగా ముగ్గు రాడపిల్లలూ, ఇద్దరు మొగపిల్లలూ మిగిలారు.

ఇక సావిత్రి భర్త చూస్తే తల్లి మాటకి తందాన. 'మాశావా అమ్మ కూడా చెప్తోంది. పుడితే పుట్టనిద్దూ సావిత్రి. చెట్టుకి కాయ భారమెలా కాదో మన పిల్లలూ మనకి భారం కాదు. ఎలాగో అలా పోషించుకో లేకపోము.' అంటూ ఆపరేషనుకి ఒప్పుకోలేదుట.

అవిషయాన్ని కమలతో చెప్పుకుని ఏడ్చింది సావిత్రి. 'ఈదేశంలో ఆడదయి పుట్టడం అంత దౌర్భాగ్యం మరోటి లేదుకమలా! ఎంతసేపూ పిల్లలో పిల్లలో అంటూ అంగలారుస్తారే తప్ప భార్యనే జీవి ఏమైపోతోందో కాస్తయినా ఆలోచించరు గదా! ఆయనకి అవసరాలు తీర్చే దానిలాగా, పిల్లలకి వేళకన్నీ అమర్చి పెట్టే అమ్మలాగా, ఇంటి పని చేసే

దాసీదాని లాగా చలామణీ అవుతున్నారే తప్ప నేనూ మనిషిననీ, నాకూ అందరిలా విశ్రాంతి అవసరమనీ తోచదు వాళ్ళకు, అంతే కాదు. ఇంటెడు పనిచేసుకుని ఒక్క క్షణం కూర్చున్నా వంటేసరి ఏదో ఒకపని పురమాయిస్తారు. అప్పటికి కవసరం లేనిదైనా సరే చచ్చి నట్టు చెప్పిన వెంటనే చెయ్యాల్సిందే. లేకపోతే మా అత్తగారు వాగ్బాణాలు ప్రయోగిస్తుంది. శరీరానికి కలిగే శ్రమ కన్నా ఇవే ములుకుల్లా తగిలి మనస్సును బాధపెడతాయి.'


'ఏదే నామంచి టానిక్కు తీసుకో సావిత్రీ' అందిసానుభూతిగా చూస్తూ కమల.

'చాలీ చాలని జీతాలు, ముంచుకొస్తున్న ఖర్చులు ఎదిగొస్తున్న పిల్లలు, వాళ్ళ ఆకలితో అమ్మా, అమ్మా అంటూంటే, నేను పసులూ ఇరవైలూ పోసి ఆ టానిక్కు ఎలా పుచ్చుకోను చెప్పు కమలా, నాకవి ఎలా మింగుడు పడతాయి. ఆడబ్బింటే పిల్లల కేదేనా టిఫిను చేసి పెట్టొచ్చుకదా. అనిపిస్తుంది.' అంటూ కళ్ళొత్తుకుంది సావిత్రి. అంతావిని సానుభూతి చూపించడం తప్ప మరింకేం చెయ్యలేక పోయింది కమల.

మానవులు విధి చేతిలో కీలుబొమ్మలు. విధి ఎలా ఆడిస్తే అలా ఆడతారే తప్ప సంకల్ప బలంతో తమ బ్రతుకులు మార్చుకోవా లనుకోరు.

అయిదోవాడికి ఏడాది నిండకుండానే మళ్ళీ నీళ్ళోసుకుంది సావిత్రి, మరో రెండు నెలలకి అత్తగారు పోయారు. పాపం ఆవిడవుంటే ఓపిక పోయినా పిల్లల్తో కోడలొక్కర్తీ తంటాలు పడలేదని మధ్యాహ్నం యింత పుడకేసి పడేసి మడిగా తనింత తిని ఇవతలకి వచ్చి మనుమలకీ, మనుమరాళ్ళకీ కథలూ, కబుర్లూ చెబుతూ మధ్యమధ్య వచ్చే పోయే వాళ్ళను పలకరిస్తూ అలా వీధి వసారాలో కూర్చుని వుండేది.

సావిత్రి పై పన్లయాక వెళ్ళి భర్తకీ పిల్లలకీ వడ్డించుకునేది. అత్తగారు పోయాక సావిత్రి పని మరీ కుడితిలో పడ్డ ఎలక సామ్యంగా తయారయింది. ఇటు చంటి పిల్లాడిని సముదాయించుకోవాలి. తొమ్మిది కొట్టేసరికి భర్తకీ పిల్లలకీ అన్నాలు పెట్టి భర్తని ఆఫీసుకీ, పిల్లల్ని ముస్తాబుచేసి స్కూలుకి పంపాలి. యంత్రం లాగే తిరిగి పనిచేసేది సావిత్రి. పనిమనిషి పనీ, చాకలిపనీ కూడా తనేచేసు కోనుకోవటంతో క్షణం తీరిక లేకుండా అయిందామెకు, నవనవలాడుతూ కాస్తవొళ్ళు చెయ్యాల్సింది పోయి మరి కాస్త చిక్కింది.




సావిత్రి ఒట్టి మనిషివి కూడా కావు. పురుడొచ్చేవరకూ పనికి ఎవరినేనా పెట్టుకోకూడదా? అంటే 'పోనిద్దూ కమలా, యీ కరువు కాలాల్లో సామాన్య సంసారులం అంతత జీతాలిచ్చి పనివాళ్ళ నెక్కడ భరించగలం.' అంటూ మాట మార్చేసింది ఆమె. సావిత్రి పెదవులపై ఎప్పుడూ చిరునవ్వు లాస్యం చేస్తూ వుండేది. మెళ్ళో ఉండేది పుస్తెలతాడే అయినా నుదుట ఎర్రని కుంకుమ బొట్టుతో ఆమె వదనం కలకల్లాడుతూ వుండేది.

టానిక్కులు పుచ్చుకోమని అస్తమానం చెప్పేది కమల. దాంతో మాట మార్చేసేది. ఆమె మనస్సు విప్పి కమలతో మాట్లాడ్డం మానేసింది.

'ఆ టానిక్కులూ అవీ పుచ్చుకుంటే కడుపులో పిల్లాడు గుమ్మడి పండులాగయిపోతే కనడం నావల్ల కాదు బాబూ,' అంటూ బుంగ మూతితో తల తమాషాగా తిప్పేది. ఆక్షణంలో ఆమె చిరునవ్వు వెనుక విషాదం లీలగా తొంగి చూచినట్లని

పించి పంచెయ్యలేక బాధగా నిట్టూర్చేది కమల.

'ఏమయింది సావిత్రికి? మునుపు కష్టసుఖాలు నాతో చెప్పుకుని బాధ తగ్గించుకునేది. ఇప్పుడన్నీ అగ్ని పర్వతంలా భరిస్తూ పెదవి కదపడం లేదు. విరాగిని అయిందా! అన్నీ భగవంతుడికే వదిలేసి తాను నిర్వికారంగా వుండిపోతోందా!' అన్న ప్రశ్నలకు సమాధానం దొరకలేదు కమలకు.

రోజులు గడుస్తున్నకొద్దీ నెలలు నిండుతున్నకొద్దీ సావిత్రి పనులు చేసుకోలేక హైరానయిపోయేది. నాలుగడుగులు వేస్తే ఆయాసపడిపోయేది. ఊపిరందేది కాదు. ఆమె బాధ చూడలేక కమల అప్పుడప్పుడు తమ పని మనిషిని పంపి అంట్లు చెంబులు తోమమని చెప్పేది.

జాలికొద్దీ ఆడపిల్లల్ని అప్పుడప్పుడు పిలిచి జడవేస్తూ వుండేది. వేసినా 'ఇక వెళ్ళి ఆడుకోండమ్మా' అని వెంటనే పంపివేసేది. అందుకే పిల్లలు కమలదగ్గర చేరిక కాలేదు. కమలెప్పుడేనా పిలిస్తే వెళ్ళి ఆమె ఇచ్చిన తినుబండారాలు తినుకుని వెంటనే వెళ్ళిపోయేవారు. పిల్లలలా వెళ్ళిపోవాలనే కమల కోరిక కూడాను. వాళ్ళమీద జాలి చూపించగలదేకాని తన దగ్గర ఎక్కువసేపుండిపోతే వాళ్ళని ప్రేమతో దగ్గరకు తీయలేదు. అందువల్లనే సాధారణంగా చిరిగిన ముక్కలతో సన్నగా అర్ధనగ్నంగా తిరిగే సావిత్రి పిల్లలంటే అంటీ ముట్టనట్టుండిపోయింది కమల.

ఒక ఆదివారంనాడు మధ్యాహ్నం మాధవరావు భోజనంచేసి అప్పుడే వచ్చిన న్యూస్ పేపరుచూస్తూ పడక కుర్చీలో పడుకున్నాడు. వంటింటి పని ముగించుకుని మొహంతోముకుని వచ్చిన కమల పౌడరు రాసుకుంటూ 'ఏమండీ నేనలా ఒకమారు సావిత్రీ వాళ్ళింటికి వెళ్ళివస్తానండీ, వారం రోజులుగా తను కనిపించలేదు. కాసేపు నిద్రపోకుండా మేలుకుని వుంటారుకదూ! కుంభకర్ణుడుగారు నిద్రపోయారా అంటే ఇక వచ్చానన్నమాటే, మీరు లేచేవరకూ ఆ వీధిలో కూర్చోవాలి జపంచేస్తూ' అంది అద్దంలో చూసుకుని కుంకుమ దిద్దుకుంటూ.

'దేవిగారంత మాటనేయకండి మరీ! మీరు వచ్చేవరకూ యీదాసుడిలాగే ఇక్కడె నిర్నిమిషుడై వుంటాడు' అన్నాడు చిలిపిగా చూస్తూ.

'అబ్బ చాలించండి స్తోత్రపాఠాలు. ఏళ్ళొస్తున్నకొద్దీ మరీ చిలిపిగా తయారవుతున్నారు' విసు

రుగా భుజంమీదికి పమిట లాక్కొని నవ్వుకుంటూ వీధిమెట్లు దిగింది కమల.

ముకుందరావు ఇల్లంతా నిశ్శబ్ధంగా వుంది. 'సావిత్రేది పిల్లలంతా ఎక్కడికి వెళ్ళారు?' అనుకుంటూ గదులన్నీ కలయతిరిగింది కమల 'సావిత్రీ - సావిత్రీ' అని పిలుస్తూ. అన్ని గదులూ వెతుకుతూ వచ్చి పడగ్గది గడపలో అడుగెట్టి వెను వెంటనే ఒకడుగు వెనక్కి వేసింది సంకోచిస్తూ.

'ఆగిపోయారేం, కమలా? రండి లోపలకి' పందిరిమంచం మీద పడుకున్న ముకుందరావు చదువుతున్న పేపరు పక్కన పెట్టి లేచికూర్చున్నాడు. తప్పనిసరియై లోపలికి వెళ్ళింది కమల.

'ఇలా కూర్చోండి' పక్కనే వున్న కుర్చీ చూపించాడు.

'సావిత్రి ఎక్కడికి వెళ్ళింది?' ఆమెను చూద్దామని వచ్చాను.

'మీ సావిత్రి వుంటేకాని మా గృహం పావనం చేయకూడదా ఏమిటి?' కొంచం నిష్ఠూరంగా అన్నాడు ముకుందరావు.

అతని ధోరణి ఆదోలా అనిపించినా పెద్దమనిషి కూర్చోమని అన్నప్పుడు తిరస్కరించి వెనుదిరిగి రావడం సభ్యతకాదని కుర్చీలో కూర్చుని అతని ప్రశ్నకు సమాధానంగా చిరునవ్వు నవ్వింది కమల.

'సావిత్రి ఎక్కడ వెళ్ళింది?' ప్రశ్న మళ్ళీ పునరావృత్తమయింది. యీమారు సమాధానం వచ్చింది.

'పిల్లని తీసుకుని ఆసుపత్రికి వెళ్ళింది.'

'అదేమి? ఏమన్నా సుస్తీగా వుందా?'

'మామూలే. తొమ్మిదో నెలకదూ, వోమారు చూపించుకుంటే మంచిదని ఘోషాసుపత్రికి వెళ్ళింది. అంటూ అర్ధంలేని నవ్వు నవ్వాడు ముకుందరావు,

తనతో చెప్పకుండా యెందుకు వెళ్ళింది. అని మనస్సులో మదన పడుతున్న కమల మరో రెండునిముషాలు కూర్చుని, 'ఇక నే వెళ్తాస్తానండీ, సావిత్రవస్తే నేనొచ్చానని చెప్పండి' అంటూ లేచి గుమ్మంవేపు రెండగులు వేసింది,

'ఒక్కమారాగండి కమలా, చాలా రోజులుగా మీతో ఒకమాట చెప్పాలనుకుంటున్నా' అంటూ వెనుకనుండి గబుక్కున ముందుకు వచ్చి కమల చెయ్యి బలంగా పట్టుకున్నాడు ముకుందరావు.

'ఏమిటిది?' తీవ్రంగా అతని వంక చూసింది కమల.

'నిన్ను చూస్తూంటే నాకు

పిచ్చెక్కి పోతోంది కమలా. అంత అందంగా వుంటావు నువ్వు ఒక్క సారి .... ఒక్కసారి .... నాకోరిక తీర్చవూ ?........'

ఒళ్ళు తెలీని ఆవేశంతో సభ్యత మరచి ఏకవచన ప్రయోగం చేస్తూ కమలను సమీపించాడు ముకుంద రావు.

'వదలండి, ఏమిటీ దౌర్జన్యం!' అతనికేసి అసహ్యంగా చూస్తూ పట్టు విడిపించుకుందుకు పెనుగు లాడింది కమల.

పట్టు మరింత బిగించి రెండో చెయ్యి ఆమె నడుము చుట్టూవేసి దగ్గరకు లాక్కున్న ముకుందరావు ఆత్రంగా ముందుకు వంగాడు.

ఆ యమపాశంలో వుక్కిరిబిక్కి రవుతున్న కమల అవకాశంరాగానే అతని భుజం ఆడపులిలా గట్టిగా కరి చేసింది.

ఆ మెరుపుదాడిని వూహించని అతను 'అబ్బా' అంటూ బాధతో కమలను వదిలేశాడు. మరుక్షణం లేడిలా అక్కడనుంచి మాయమైంది కమల.

రేగిన జుట్టుతో నలిగిన చీరతో రౌద్రశోకాలు మూర్తీభవించినట్లు అతివేగంగా ఇంట్లోకి పరుగెత్తుకొని వస్తోన్న కమలనుచూసి ఆశ్చర్య పోయాడు మాధవరావు.

'ఏమైంది కమలా, అలా వున్నావు? ఇప్పుడేకదా వెళ్ళావు. అంతలోనే వచ్చేశావే!' అతని ప్రశ్న లకు వేటికీ సమాధానం చెప్పక పరుగున వచ్చి అతని వొడిలో పడి వెక్కి వెక్కి ఏడ్చింది కమల.

'అరె! ఈ ఏడుపేమిటి కమలా! ఏం జరిగిందో చెప్పవూ? సావిత్రికీ నీకూ మధ్య ఏదేనా ఘర్షణ జరి గిందా ?' అమాయకంగా అడుగు తున్న భర్తను చూసేసరికి దుఃఖం మరీ పొంగుకు వచ్చింది కమలకు.

దుఃఖపు పొంగు కాస్త తగ్గాక భర్త సముదాయించి అడిగితే జరిగిన దంతా చెప్పకొచ్చింది కమల మధ్య మధ్య వెక్కుతూ.

'కొంచంలో బ్రతికి బైటపడ్డాను కాని లేకుంటే మనమిలా వుండే వాళ్ళం కాదు .... పెరటి నూతిలో నా శవాన్నే చూసేవారు మీరు' అంటూ మళ్ళీ వుప్పెనలా దుఃఖం ముంచుకురాగా గొల్లుమని ఏడ్చింది కమల. భార్యను దగ్గరగా తీసుకుని అనునయ వాక్యాలు చెప్పి వూరడిం చాడు మాధవరావు.

ఆవేళ్టినుండి ఎదురింటి ఛాయలకు పోలేదు కమల'

అప్పుడప్పుడు సావిత్రే వస్తూ వుండేది.

(ముగింపు సంచికలో)